క్లుప్తంగా

వైభవంగా కల్యాణోత్సవం



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

పెద్దపప్పూరు: దక్షిణ కాశీగా ప్రసిద్ధిగాంచిన చిన్నపప్పూరు సమీపంలో వెలసిన అశ్వర్థనారాయణ స్వామి క్షేత్రంలో శనివారం పౌర్ణమి సందర్భంగా స్వామి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. ఉత్సవమూర్తులైన నారాయణ స్వామి, శ్రీదేవి, భూదేవి, శ్రీచక్రభీమలింగేశ్వరుడు, పార్వతీ దేవిని అర్చకులు సునీల్‌కుమార్‌శర్మ, సుధీర్‌కుమార్‌శర్మ, బాలసుబ్రమణ్య శర్మ పట్టువస్త్రాలతో ప్రత్యేకంగా అలంకరించారు. యాడికి మండలం రాయలచెరువు గ్రామానికి చెందిన భక్తులు ఆదిగొని చిన్ననారాయణ, లక్ష్మీదేవమ్మ కుటుంబ సభ్యులు సొంతఖర్చుతో కల్యాణోత్సవం జరిపించారు. అనంతరం నిర్వాహకులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు ఆలయ కార్యనిర్వహణాధికారి సుబ్రమణ్యం, భక్తులు పాల్గొన్నారు.

ముగిసిన పురాణ ప్రవచనం



వివేక చూడామణి గ్రంథ పురాణ ప్రవచనం సాగిస్తున్న పండితుడు అనుంపల్లి భాస్కర్‌రావు

పామిడి: పట్టణంలోని తగ్గుదేవాలయంలో గత రెండున్నర సంవత్సరాలుగా సాగిస్తున్న వివేక చూడామణి గ్రంథ పురాణ ప్రవచనం శనివారం ముగిసింది. పండితుడు అనుంపల్లి భాస్కర్‌రావు ఈ గ్రంథ పురాణ ప్రవచనం చేశారు. ఆయన ఆలయంలో లాభాపేక్ష లేకుండా గత 40 సంవత్సరాలుగా పురాణాలు, ఉపనిషత్తులు, ఉపన్యాసాలు, పుస్తక పద్యాల తాత్పర్య భావాలను విశదీకరించేవారు. ఈసందర్భంగా ఆయనను భక్తులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అర్చకులు విశ్వనాథ్‌శర్మ, శాంతారాం, తల్లం లత, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

శ్రేష్ట- నెట్స్‌లో విద్యార్థి సత్తా



సునీత్ వర్ధన్

గుంతకల్లుటౌన్: కేంద్ర ప్రభుత్వ విద్య, సామాజిక న్యాయం సాధికారత మంత్రిత్వ శాఖ ద్వారా దేశంలోని అత్యుత్తమ రెసిడెన్షియల్ స్కూల్స్‌లో ప్రవేశానికై నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహించిన శ్రేష్ట-2024 పరీక్షలో గుంతకల్లు బీటీ పక్కీరప్ప కాలనీకి చెందిన వై.సునీత్ వర్ధన్ అనే విద్యార్థి జాతీయస్థాయిలో 285వ ర్యాంకు సాధించాడు. మే 11న దేశవ్యాప్తంగా జరిగిన ఈ ఎంట్రెన్స్‌కు సంబంధించిన ఫలితాలు శుక్రవారం విడుదలయ్యాయి. ఈ పరీక్షలో సునీత్‌వర్ధన్ 400 మార్కులకు గానూ 216 మార్కులు సాధించాడు. కుమారుడు జాతీయస్థాయిలో ర్యాంకు సాధించడంపై తల్లిదండ్రులు సుకన్య,సుధాకర్ సంతోషం వ్యక్తం చేశారు.


బడి ఈడు పిల్లలను పాఠశాలలో చేర్పించాలి

గార్లదిన్నె: మండల వ్యాప్తంగా వివిధ గ్రామాల్లో ఐదేళ్లు నిండిన పిల్లలందరినీ బడిలో చేర్పించాలని ఎంఈఓ-1 చంద్రనాయక్ సూచించారు. శనివారం ఎంఈఓ మాట్లాడుతూ సీఆర్పీలు, ప్రధానోపాధ్యాయులు, అంగన్ వాడీ సిబ్బంది 'నేను బడికి పోతా కార్యక్రమం'పై గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించాలన్నారు. అలాగే పిల్లలు ఎవరూ పనిలో ఉండకూడదని, తప్పనిసరిగా బడిలో ఉండాలన్నారు. పిల్లలను పాఠశాలకు పంపితే బంగారు భవిష్యత్ ఉంటుందన్నారు.

లక్ష్యం నిర్దేశించుకోవాలి

గుత్తి రూరల్: ప్రతి విద్యార్థి ఓ లక్ష్యం నిర్దేశించుకొని చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సర్పంచ్ చిన్న ఆంజనేయులు, ఎంపీటీసీ ధనుంజయ, హెచ్‌ఎం మహాలక్ష్మి ససూచించారు. శనివారం మండలంలోని బేతాపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 'నేను బడికి పోతా' కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత ఉద్యోగాలు సాధించాలన్నారు. అనంతరం ప్రొద్దుటూరుకు చెందిన చంద్రశేఖర్‌రెడ్డి పాఠశాలలోని 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకూ చదువుకొనే విద్యార్థులు 150 మందికి నోటు పుస్తకాలు, పలకలు, పెన్నులు, మిఠాయిలు అందజేశారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



కలశ స్థాపన చేసిన దృశ్యం

తాడిపత్రి అర్బన్: పట్టణంలోని సంజీవ నగర్ మొదటి రోడ్డులోని శ్రీవేద గాయత్రీదేవి ఆలయ వార్షికోత్సవం శనివారం ఘనంగా ప్రారంభించారు. శనివారం ఉదయం ఆలయంలోని ప్రధాన మండపంలో మహా సంకల్పం, గణపతి పూజ కార్యక్రమాలతో ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. వేదపండితులు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి కలశ స్థాపన చేశారు. అనంతరం హోమాది కార్యక్రమాలు నిర్వహించి అభిషేకం, విశేష పూజాది కార్యక్రమాలు చేశారు.

వంటింట్లో ధరల మంట

- హడలెత్తిస్తున్న కూరగాయల ధరలు
- కిలో బీన్స్ రూ.200, అల్లం రూ.180
- అవస్థలు పడుతున్న సామాన్యులు



కొనుగోలుదారులు లేక వెలవెలబోతున్న తాడిపత్రి మార్కెట్

తాడిపత్రి అర్బన్: కూరగాయల కోసం మీరు సంతకో...దుకాణానికో వెళుతున్నారా?....అయితే జాగ్రత్త.. అలా వెళితే తోడుగా కుటుంబ సభ్యుల్లో ఎవరినైనా తీసుకువెళితే మంచిది. ఎందుకంటే అక్కడ ధరలు చూసి కళ్లు తిరిగి కిందపడే ప్రమాదం ఉంది. ఏ రకం కాయగూరలు చూసినా కిలో రూ.50కి పైనే ఉన్నాయి. ఆ ధరలు చూసి ముచ్చెమటలు పడుతున్నాయి. స్థానికంగా సరుకు వస్తేనే కానీ సామాన్యులు కూరలు వండుకునే పరిస్థితి లేదు.కూరలు అత్యవసరంగా వండుకోవాలంటే ప్రతి ఒక్కరూ టమాటకి ప్రాధాన్యమిస్తారు. అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉండే కూరగాయ అనగానే ప్రతి ఒక్కరికీ గుర్తొచ్చేది కూడా టమాటే. అలాంటి టమోటా నిన్న మొన్నటి వరకు రూ.50కు మూడు కిలోలు వచ్చేవి. ప్రస్తుతం కిలో రూ.80కి చేరింది. కిలో బీన్స్ రూ.200 ధర పలుకుతోంది. అల్లం రూ.100 నుంచి రూ.180 వరకు పలుకుతోంది. పచ్చిమిర్చి గురించి ఎంత తక్కువ చెబితే అంత మంచిది. ప్రతి ఇంట్లో వాడే దీని ధర రూ.50 నుంచి రూ.70కి చేరింది.

బెంబేలెత్తిస్తున్న బీన్స్

బీన్స్ బెంబేలెత్తిస్తోంది. చికెన్ ధరతో బీన్స్ పోటీ పడుతోంది. వారం రోజుల కిందట కిలో రూ.120 పలుకుతుండగా ప్రస్తుతం రూ.200కు చేరింది. మిగతా కూరగాయల ధరలు కూడా ఇదే స్థాయిలో ఉండడంతో సామాన్య, మధ్య తరగతి ప్రజలు వీటిని కొనాలంటేనే బయపడుతున్నారు. క్యారెట్ ధర రూ.80 వరకు పలుకుతోంది. రూ.30 ఉండాల్సిన బెండకాయ రూ.60కి చేరుకుంది. మటిక్కాయాలు రూ.40 నుంచి రూ.60ల వరకు విక్రయిస్తున్నారు. ఇక ఆకుకూరల పరిస్థితీ అంతే.. వారం క్రితం పదికి రెండు కట్టలు ఇవ్వగా ప్రస్తుతం ఒక కట్ట రూ.10కు ఇస్తున్నారు. వారం క్రితం వరకు రూ.100 ఉన్న అల్లం ప్రస్తుతం రూ.180కి చేరింది. దీంతో వంట గది నుంచి అల్లం మాయవుతోంది.

తారెత్తిస్తున్న టమాట

వెజ్,నాన్‌వెజ్ వంటకాలు ఏవైనా వాటిలోకి టమాట కచ్చితంగా వాడాల్సిందే. అయితే ఇప్పుడా పరిస్థితి లేదు. అందరికీ ఎంతో ప్రియమైన ఈ టమాటను కొనాలంటేనే మధ్యతరగతి ప్రజలు జంకాల్సిన పరిస్థితి ఏర్పడింది. నెల రోజుల క్రితం సరైన ధర లేక రైతన్నలు కన్నీళ్లు పెట్టుకుంటూ పండించిన పంటను రోడ్లపై పడేసిన దృశ్యాలు చూశాం. కాగా ఇప్పుడు పెరిగిన ధరలతో కొనుగోలుదారులను ఏడిపిస్తోంది. ప్రస్తుతం టమాట కిలో రూ.90కి చేరింది. రూ.200 తీసుకెళితే కనీసం నాలుగు రకాల కూరగాయలు కూడా వచ్చే పరిస్థితి లేదని సామాన్యులు వాపోతున్నారు. రోజంతా కష్టపడితే రూ.200కు మించి రావడం లేదని, ఆ మొత్తం కూరలకే పెడితే, ఎలా బతకాలని ఆందోళన చెందుతున్నారు.

తగ్గిన కూరగాయల సాగు

వర్షాభావం, వేసవి తీవ్రత అధికమైన నేపథ్యంలో స్థానికంగా కూరగాయల సాగుతోపాటు ఉత్పత్తి గణనీయంగా తగ్గింది. దీనికితోడు బయట మార్కెట్ల నుంచి సంతలకు కూరగాయల దిగుమతి కూడా తగ్గింది. ఈనేపథ్యంలో ప్రస్తుతం తాడిపత్రి నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో సంతల్లో గతంలో రోజుకు వెయ్యి బస్తాల ఉల్లిపాయలు, బంగాళాదుంపలు ఇతర కూరగాయలు వచ్చేవి. అయితే ప్రస్తుతం 400 బస్తాలు, టమాటాలు 200 బాక్స్‌లు, ఇతర కూరగాయలు కూడా అంతంత మాత్రంగానే సంతలకు వస్తున్నాయి. దీంతో కూరగాయల ధరలు రెండింతలు పెరిగాయి. అవి కూడా కర్ణాటకలోని హాసన్, చిత్రదుర్గ, బెల్గాం, తమిళనాడులోని వేలూరు, చిత్తూరు జిల్లా మదనపల్లి నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. మదనపల్లి మార్కెట్ నుంచి టమాటాను దిగుమతి చేసుకుంటుండడంతో ధరలు అమాంతం పెరిగాయని వ్యాపారులు పేర్కొంటున్నారు. వర్షాలు సమృద్ధిగా కురిసి భూగర్భజలాలు పెరిగే వరకూ కూరగాయల ధరలు తగ్గే అవకాశం లేదన్నారు.

ధరల వివరాలు ఇలా..

కూరగాయల రకం	కిలో ధర (రూపాయల్లో)
బీన్స్	200
టమాట	80
పచ్చిమిర్చి	70
ఉల్లిగడ్డలు	60
క్యాబేజీ	35
బెండకాయ	60
క్యారెట్	80
కాకరకాయ	80
ఆలుగడ్డ	40
బీరకాయ	50
చిక్కుడుకాయ	40
వంకాయ	50
ముల్లంగి	50
ఆకుకూరలు (కట్ట)	20
కొత్తిమీర (కట్ట)	40

ఇబ్బంది పడుతున్నాం



గత నెలకు ఇప్పటి మార్కెట్‌కు కాయగూరల ధరలు రెండింతలు పెరిగాయి. ఉల్లిపాయలు, మిర్చి, టమాట, బీన్స్, క్యారెట్, క్యాప్సికం ధరలు విపరీతంగా పెరిగాయి. సామాన్యులు ఇబ్బందులు పడకుండా ప్రభుత్వం కాయగూరల ధరలు నియంత్రించాలి. అప్పుడే రోజూ కూలి పనులకె వెళ్లి జీవనం చేస్తున్న కుటుంబాలకు మంచిది.

– రాధ, గృహిణి, తాళ్లప్రొద్దుటూరు

కొనలేం.. తినలేం..



చేతిలో రూ.200 తీసుకెళితే కూరగాయలు అర్ధ సంచికి కూడా రావడం లేదు. రూ.500 పెడితే అంతంత మాత్రంగా కూరగాయలు ఇంటికి తెచ్చుకోవచ్చు. అది కూడా వారానికి మాత్రమే సరిపోతాయి. ఎండ వేడిమి కన్నా కూరగాయల ధరలకు కళ్లు బైర్లు కమ్ముతున్నాయి. సామాన్యులు ఏమీ కొనలేని.. తినలేని పరిస్థితి దాపురించింది.

– ధనలక్ష్మి, గృహిణి, వెంకటరెడ్డిపల్లి

దిగుబడి లేకనే అధిక ధరలు



వేసవిలో విపరీతంగా పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో దిగుబడి రాక కాయగూరల ధరలు విపరీతంగా పెరిగాయి. తాడిపత్రి నియోజకవర్గంలో సంతలకు వ్యాపారులు కూరగాయలు, టమాటను అధికంగా తెచ్చేవారు. ప్రస్తుతం చాలా తక్కువగా వస్తున్నాయి. ఫలితంగా ధరలు పెరిగాయి. బెంగళూరు ఐటమ్స్‌కు మాత్రం మంచి ధర పలుకుతోంది. ఈనేపథ్యంలో వ్యాపారం గణనీయంగా తగ్గింది.

– బండి మల్లికార్జున, హోల్‌సేల్ వ్యాపారి, తాడిపత్రి

పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం



పెద్దపప్పూరు మండలం దేవునిఉప్పలపాడులో వైద్యపరీక్షలు చేస్తున్న దృశ్యం



బుక్కరాయసముద్రంలోని పాఠశాల తరగతి గదుల్లో స్ప్రేయింగ్ చేస్తున్న దృశ్యం



తాడిపత్రిలో అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ షాజిదాబేగం



గుత్తిలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు

బుక్కరాయసముద్రం: పాఠశాల పరిసర ప్రాంతాల్లో దోమలు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా మలేరియా సబ్ యూనిట్ అధికారి మద్దయ్య సూచించారు. శనివారం మండల కేంద్రంలోని ఎస్సీ, ఎస్టీ హాస్టల్‌లో దోమల మందు స్ప్రేయింగ్ చేయించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాలను శుభ్రంగా ఉంచు కోవాలన్నారు. పాఠశాలలో చెత్త కుండీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలన్నారు. సీజనల్ వ్యాధులు వాటి నివారణ చర్యలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం పాఠశాలలోని తరగతి గదులలో దోమలు ప్రబలకుండా మందు స్ప్రేయింగ్ చేయించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ మోహన్‌రావు, పీహెచ్‌ఎన్ చెన్నమ్మ, శ్రీధర్‌మూర్తి, నూర్‌బాషా, ధనుంజయ, ఆనంద్, వసతి గృహాల అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డయేరియా సోకకుండా అప్రమత్తంగా ఉండాలి

తాడిపత్రి అర్బన్: డయేరియా సోకకుండా అప్రమత్తంగా ఉండాలని ఐసీడీఎస్ సీడీపీఓ షాజిదాబేగం సూచించారు. శనివారం పట్టణంలోని శ్రీనివాసపురం-2 అంగన్‌వాడీ కేంద్రంలో డయేరియాపై చిన్న పిల్లల తల్లులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ నీటిని కాచి వడపోసి తాగేలా చిన్నారులకు అవగాహన కల్పించాలన్నారు. కడుపులో ఉబ్బరం, వాంతులు, విరేచనాలు అవుతున్నట్‌లెతై వెంటనే వైద్యులను సంప్రదించి, మందులు వాడాలన్నారు. డయేరియా సోకుండా వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. కార్యక్రమంలో సూపవర్‌వైజర్లు లక్ష్మిదేవి, దస్తగిరమ్మ, ఏఎన్‌ఎం సంతోషమ్మ, మహిళా పోలీస్ కాంతమ్మ, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలి

గుత్తి: వర్షాలు కురుస్తుండటంతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశముందని, సీజనల్ వ్యాధులు ప్రబల కుండా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు ఆదేశించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శనివారం సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సచివాలయాల అమినిటీస్, హెల్త్ సెక్రటరీలు, శానిటరీ సెక్రటరీలు హాజరైయ్యారు. కమిషనర్ మాట్లాడుతూ దోమల వల్ల సీజనల్ వ్యాధులైన మలేరియా, టైఫాయిడ్, డయేరియా, డెంగీ వ్యాపించే అవకాశముందన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా దోమల వ్యాప్తిని అరికట్టవచ్చన్నారు. కార్యక్రమంలో డీఈ రఘు, ఏఈ సాయి తదితరులు పాల్గొన్నారు.

జాగ్రత్తలు పాటిస్తే వ్యాధులు దరిచేరవు

పెద్దపప్పూరు: ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటిస్తే ఎలాంటి వ్యాధులు దరిచేరవని మండల వైద్యులు తేజశ్వి, సురేంద్రరెడ్డి సూచించారు. శనివారం మండలంలోని దేవునిఉప్పలపాడులో డయేరియా కేసులు ఉన్నట్లు సమాచారం అందడంతో.. గ్రామంలో వైద్యశిబిరం నిర్వహించి రోగులకు వైద్య పరీక్షలు చే సి మందులు పంపిణీ చేశారు. మిగిలిన ఆహార పదార్థాలను తినడం, కలుషిత నీరు తాగడం వల్ల వాంతులు, విరోచనాలయ్యే అవకాశం ఉందన్నారు. ఎలాంటి చిన్నపాటి ఆరోగ్య సమస్య వచ్చినా నిర్లక్ష్యం చేయకుండా 108, 104 వాహనసేవలను సద్వినియోగం చేసుకుని సమీపంలోని ప్రభుత్వాస్పత్రికి వెళ్లి చికిత్స చేయించుకోవాలన్నారు.

సోషల్ ఆడిట్ నిష్పక్షపాతంగా చేయండి

గార్లదిన్నె: మండల వ్యాప్తంగా వివిధ గ్రామాల్లో చేసిన ఉపాధి పనుల్లో సోషల్ ఆడిట్ నిష్పాక్షపాతంగా చేయాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ వెంకటలక్ష్మి సూచించారు. శనివారం ఆమె మాట్లాడుతూ 2023 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31 వరకూ జరిగిన ఉపాధి పనుల్లో సోషల్ ఆడిట్ చేస్తున్నామన్నారు. ఈ నెల 23 నుంచి 30వ తేదీ వరకూ సోషల్ ఆడిట్ సిబ్బంది ఆయా గ్రామాల్లో జరిగిన ఉపాధి పనుల్లో తనిఖీలు నిర్వహిస్తారన్నారు. గ్రామ సభలు అనంతరం మండల స్థాయిలో ప్రజావేదిక నిర్వహిస్తామన్నారు.

సివిల్ సప్లై స్టాక్ పాయింట్ తనిఖీ



స్టాక్ పాయింట్‌ను తనిఖీ చేస్తున్న ఆర్డీఓ

గుత్తి: పట్టణంలోని కర్నూల్ రోడ్డులో ఉన్న సివిల్ సప్‌లై స్టాక్ పాయింట్‌ను శనివారం గుంతకల్లు ఆర్డీఓ శ్రీనివాసులు రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన స్టాక్ పాయింట్‌లోని అన్ని రకాల రికార్డులను పరిశీలించారు. అనంతరం స్టాక్‌ను తనిఖీ చేశారు. కార్యక్రమంలో సీడీపీఓ ఢిల్లీశ్వరి, సూపర్ వైజర్లు నాగేశ్వరి, గౌరి తదితరులు పాల్గొన్నారు.

భర్తపై కేసు నమోదు

పుట్లూరు: మద్యం సేవించి భౌతిక దాడికి పాల్పడుతున్న దామోదరం అనే వ్యక్తిపై అతని భార్య అశ్విని శనివారం పోలీసులకు పిర్యాదు చేసింది. వారికి 20 సంవత్సరాల క్రితం వివాహం కాగా ఇద్దరు కుమారులున్నారు. ఈ విషయమై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ హేమాద్రి తెలిపారు.

ఇసుక టిప్పర్, ట్రాక్టర్ సీజ్

పెద్దపప్పూరు: ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్న టిప్పర్, ట్రాక్టర్‌లను ఇన్‌చార్జ్ ఎస్‌ఐ గౌస్‌బాషా సీజ్ చేశారు. శనివారం దేవుని ఉప్పలపాడు సమీపంలోని పెన్నానది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్, తాడిపత్రి మండలం కోమలినుంచి పెద్దపప్పూరు మండలం జోడిధర్మాపురం వద్ద టిప్పర్‌ను సీజ్ చేసి వాహన యజమానులపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

రాజకీయ కక్షతోనే ఆస్తుల విధ్వంసం

గుంతకల్లు రూరల్: రాజకీయ కక్షతోనే వైఎస్సార్‌సీపీ ఆస్తులను విధ్వంసం చేస్తున్నారని ఆ పార్టీ ఐటీ వింగ్ జిల్లా అధ్యక్షుడు వై.రాజశేఖర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో విమర్శించారు. ప్రజలకు మంచి చేస్తారని టీడీపీకి ప్రజలు అధికారాన్ని కట్టబెడితే రాజకీయ కక్షతో వైఎస్సార్‌పీ ఆస్తుల విధ్వంసానికి పాల్పడుతున్నారన్నారు. పార్టీ అధికారంలోకి వచ్చిన మరుసటి రోజు నుంచే విగ్రహాలు, శిలాఫలకాలు పగులగొడుతూ దౌర్జన్యానికి తెగబడుతున్నారన్నారు. టీడీపీ ప్రభుత్వం రాక్షస పాలనకు తెరలేపిందని, ఈ విషయాలన్నింటినీ ప్రజలు గమనిస్తున్నారన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కాగానే కులమతాలకు అతీతంగా పాలన సాగిస్తే, చంద్రబాబు మాత్రం దౌర్జన్యకాండను మొదలుపెట్టారన్నారు.

రోడ్డు ప్రమాదంలో బాలుడి మృతి

- ముగ్గురికి గాయాలు



విష్ణు మృతదేహం

గుత్తి రూరల్: మండలంలోని వన్నేదొడ్డి గ్రామ శివారులో 44వ నంబర్ జాతీయ రహదారిపై శనివారం ద్విచక్రవాహనం అదుపు తప్పి బోల్తా పడిన ఘటనలో విష్ణు(4) అనే బాలుడు మృతి చెందగా ముగ్గురికి గాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు.. తమిళనాడు రాష్ట్రం ధర్మపురి జిల్లా పెన్నాగరానికి చెందిన కార్తీక్, భార్య సత్య, బావమరిది మోహన్ హైదరాబాదు జీడిమెట్ల ప్రాంతంలోని ఎస్‌ఆర్ నాయక్‌నగర్‌లో గత మూడేళ్లుగా హాట్ చిప్స్ వ్యాపారం చేస్తూ జీవనం సాగించేవారు. పది రోజుల క్రితం సొంతూరుకు వెళ్లి ద్విచక్రవాహనంలో తిరిగి హైదరాబాదుకు వెళ్తూ వన్నేదొడ్డి గ్రామ శివారులో డివైడర్‌ను ఢీకొన్నారు. ద్విచక్రవాహనం నుంచి నలుగురు రోడ్డుపై ఎగిరిపడి తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదంలో బాలుడు విష్ణు, మోహన్, కార్తీక్, సత్యకు తీవ్ర గాయాలయ్యాయి. హైదరాబాదు వైపు కారులో వెళ్తున్న ఇద్దరు వైద్యులు.. రోడ్డుపై పడి ఉన్న వారిని గమనించి కారులో గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యంలో విష్ణు మృతి చెందాడు. వైద్యుల సూచన మేరకు మోహన్‌ను అనంతపురం తరలించారు. ఒక్కగానొక్క కుమారుడు మృతితో తల్లిదండ్రులు విష్ణు మృతదేహంపై పడి కన్నీరు, మున్నీరుగా విలపించారు. సంఘటన స్థలాన్ని ఎస్‌ఐ నబీరసూల్ పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లోక్ అదాలత్ సద్వినియోగం చేసుకోండి

గార్లదిన్నె: ఈ నెల 29న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌ఐ మహమ్మద్ గౌస్ సూచించారు. శనివారం ఎస్‌ఐ మాట్లాడుతూ జిల్లా కోర్టులో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తారన్నారు. కక్షదారులు రాజీ మార్గం ద్వారా కేసులు పరిష్కరించుకోవాలన్నారు. రాజీ మార్గమే రాజ మార్గమన్నారు. రాజీకి ఆమోద యోగ్యమైన అన్ని కేసులు లోక్ అదాలత్‌లో పరిష్కరిస్తారన్నారు.

శుభవార్త సభలు జయప్రదం చేయండి

పామిడి: పట్టణంలోని హనుమాన్ లింక్‌రోడ్డు సర్కిల్ సమీపాన శాశ్వత కృపా మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో ఈనెల 24, 25, 26వ తేదీల్లో నిర్వహించే అందరికి రక్షణ శుభవార్త సభలను జయప్రదం చేయాలని నిర్వాహకులు పీటర్ విజయ్, విజయ్ ఛార్లెస్, ప్రభాకర్ ఛార్లెస్ శనివారం తెలిపారు. సభలకు ముఖ్య ప్రసంగీకులుగా గుంటూరు యూదా మిస్‌స్ట్రీస్ పాస్టర్, దైవజనులు నెహమ్యా విచ్చేస్తారన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

గుత్తి: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద శనివారం రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ముందు వెళుతున్న ఆటోను వెనుక నుంచి బైక్ ఢీ కొంది. ప్రమాదంలో బైక్‌ను డ్రైవ్ చేస్తున్న ఆర్‌ఎస్‌కు చెందిన రామకృష్ణ అనే వ్యక్తి గాయపడ్డాడు. స్థానికులు వెంటనే అతడిని ఆస్పత్రికి తరలించారు. పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ప్రశాంతంగా ప్రవేశ పరీక్ష



పరీక్ష రాస్తున్న విద్యార్థులు

యాడికి: మండలంలోని ఏపీ మోడల్ స్కూల్‌లో 7,8,9 తరగతులకు సంబంధించి 89 ఖాళీ సీట్లకు శనివారం ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. 7వతరగతిలో 40 సీట్లు ఖాళీ ఉండగా 10 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. 8 వతరగతిలో 24 సీట్లు ఖాళీ ఉండగా 21 మంది విద్యార్థులు, 9వ తరగతిలో 25 సీట్లకు 29 మంది విద్యార్థులు హాజరయ్యారని ప్రిన్సిపాల్ మారుతి తెలిపారు. మెరిట్ ఆధారంగా సీట్లను భర్తీ చేయనున్నట్లు ఆయన తెలిపారు.

రేషన్ పంపిణీ సక్రమంగా నిర్వహించాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ శేషఫణి

గుంతకల్లు రూరల్: మండలంలో ఇంటింటా రేషన్ పంపిణీ కార్యక్రమాన్ని సక్రమంగా నిర్వహించాలని తహసీల్దార్ శేషఫణి సూచించారు. శనివారం ఆయన సీఎస్‌డీటీ సుబ్బలక్ష్మితో కలిసి రేషన్ డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎండీయూ ఆపరేటర్లు, రేషన్ డీలర్లు సమన్వయంతో పనిచేస్తూ రేషన్ పంపిణీ కార్యక్రమం చేపట్టాలన్నారు. ప్రభుత్వ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలన్నారు.

రేపు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

శింగనమల: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ బీవీ రమణ తెలిపారు. ప్రజలు తమ సమస్యలను విన్నవించుకుంటే పరిష్కరిస్తామన్నారు. మండల స్థాయి అధికారులందరూ హాజరు కావాలన్నారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకం



నగదు ప్రోత్సాహకాన్ని అందజేస్తున్న విశ్రాంత అధ్యాపకుడు నందవరం కేశవరెడ్డి

పెద్దపప్పూరు: మండలంలోని పెద్దయక్కలూరు జిల్లా పరిషత్తు ఉన్నతపాఠశాలలో పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు శనివారం నగదు ప్రోత్సాహక బహుమతులను విశ్రాంత అధ్యాపకులు నందవరం కేశవరెడ్డి అందజేశారు, ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులు హేమలతకు రూ.5 వేలు, పవిత్రకు రూ.4 వేలు, ప్రమీలకు రూ.3 వేలు పంపిణ చేశారు. గత మూడు సంవత్సరాలుగా నగదు ప్రోత్సాహక బహుమతులను కేశవరెడ్డి అందజేస్తున్నట్లు హెచ్‌ఎం క్రిష్ణమోహన్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే



గ్రాడ్యుయేషన్ డే నిర్వహిస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: మండలంలోని నక్కనదొడ్డి గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం గ్రాడ్యుయేషన్ డే ఘనంగా నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రంలో 10 మంది చిన్నారులు రెండు సంవత్సరాల ప్రీ స్కూల్ పూర్తి చేసుకుని గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో చేరుతున్న సందర్భంగా గ్రాడ్యుయేషన్ డే చేపట్టారు. అనంతరం చిన్నారులను పాఠశాలలో చేర్పించారు. కార్యక్రమానికి ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పుష్పావతి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.